ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 13 ఏప్రిల్, 2025 | పేజీలు : 08




## ప్రాజెక్టు పనులు అడ్డగించిన నిర్వాసితులు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలములోని శివన్నగూడ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో ముంపు గ్రామమైన వెంకేపల్లి గ్రామస్తులు శనివారం ఉదయము ప్రాజెక్టు పనులను నిర్వాసితులు అడ్డుకున్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్ లో భూములు కోలుపోయిన నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇండ్ల స్థలాలు, ఇచ్చేవరకు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# ఎప్పటికి తీరేను నీటి కష్టాలు...

### రోజుల తరబడి నీళ్లు లేక కాలనీవాసుల విలవిల...

### కొన్ని దశాబ్దాలుగా ఇదే తంతు...



**ప్రజాపక్షం/నందికొండ:** నందికొండ మున్సిపాలిటీలో తాగునీటికి కష్టాలు తప్పడం లేదు పండుగ అని , సెలవు అని, వర్షాకాలం, ఎండాకాలం, అని రోజులతో కాలంతో సంబంధం లేకుండా, పక్కనే రిజర్వాయర్ లో నీరు కళ్ళ ముందు కనిపిస్తున్నా ఇదే నీరు హైదరాబాదుకు ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతున్నా స్థానిక ప్రజలకు మాత్రం అటు తాగునీటికి ఇటు సొంత అవసరాలకు, నీరు దొరకదు రోజుల తరబడి నీటి కోసం విలవిలాడుతున్నా పట్టించుకునే నాధుడుండడు. దానితో నీటి కోసం ప్రజల పాట్లు ఈ జన్మలో తీరేలా కనిపించడం లేదు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో కొన్ని రోజులుగా గృహలకు తాగునీరు సరిగా సరఫరా కావడం లేదు సంబంధిత అధికారులకు నీటి సరఫరా అంతరాయానికి గల కారణం తెలుసుకోవాలని ప్రయత్నిస్తే అందుబాటులో ఉండరు, ఫోన్ చేసినా సమాధానం ఉండదు. ఎదురు పడినప్పుడు కారణమడిగితే అటు తాగునీటిని సరఫరా చేసే మోటార్లు చెడిపోయాయనో,లో ఓల్టేజితో మోటర్లు నడవడం లేదనో కొన్ని దశాబ్దాలుగా ఈ సాకు చెప్పటం తప్ప వాటికి పరిష్కార మార్గాన్ని చూడటం లేదు. సంబంధిత శాఖ లో అరకొర సిబ్బంది మాత్రమే ఉంటారు వారితోనే ఈ పనులను చక్కబెడుతూ ఉంటారు కాలనీలో కొన్ని దశాబ్దాల కాలంగా గృహలకు నీటి సరఫరా సరిగా జరగక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు . కాలనీలో నిత్యం జరుగుతున్న ఈ నీటి సరఫరా అంతరాయానికి ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి తాగునీటి సమస్య పరిష్కరించాలని మళ్ళీ మళ్ళీ ఇలాంటి సమస్య తలెత్తకుండా సమస్య కు పూర్తిగా చెక్ పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య..

### అక్రమ సంబంధమా..? కుటుంబ కలహాల..?

### జిల్లా నడిబొడ్డు టూటౌన్ పోలీస్ స్టేషన్ అతి సమీపంలోనే హత్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఒక వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.మణికంఠ కలర్ ల్యాబ్ లో వర్కర్లు డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లిన సందర్భంలో ల్యాబ్ యజమాని సురేష్ ను గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. జిల్లా నడిబొడ్డు టూటౌన్ పోలీస్ స్టేషన్ అతి సమీపంలోనే ఈ హత్య జరగడంతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు.ఇంతకు ఈహత్య అక్రమ సంబంధమా.. కుటుంబ కలహాల..అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.వివరాల్లోకి వెళితే ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కలర్ ల్యాబ్ లోకి వచ్చి ముందు కూర్చొని ఒకరు ఫ్రేమ్స్ గురించి అడుగుతున్నప్పుడు మరొక అతను బ్యాగ్ లో నుండి కత్తి తీసి గుండె మీద వేటు వేయడం జరిగింది. వెంటనే షాక్ కు గురైన సురేష్ కౌంటర్ ద్వారా వారి నుంచి తప్పించుకుని ప్రయత్నంలో కౌంటర్ దాటి వస్తుండగా మరొ అతను సురేష్ కాళ్లు పట్టి లోపలకు లాగడం జరిగింది. మేకింగ్ రూమ్ లోపల చనిపోయేదాకా వెన్నులో 16 కత్తిపోట్లు,గొంతు మీద ఒక పోటు వేయడం జరిగింది. మొత్తం మీద గుండె మీద ఒకటి, గొంతు మీద ఒకటి, వెన్నులో 16 మొత్తం 18 పోట్లు పొడిచి సురేష్ ని దుండగులు హతమార్చారు. ఇదంతా తన ల్యాబ్ లోని సీసీ కెమెరాలో రికార్డు అయింది.హత్య చేసిన దుండగులు నడుచుకుంటూ సాదాసీదాగా రైల్వే స్టేషన్ కి వెళ్లారు. ఈ ఉదంతం తెలిసిన వెంటనే నకిరేకల్ లో ఉన్న సురేష్ భార్య,ఇద్దరు పిల్లలు సంఘటన చోటుకు రావడం జరిగింది. ఇద్దరు అబ్బాయిలు భార్యతో వేరుగా ఉంటున్నారు. ఏదో ఒక వారం తప్పితే ప్రతి శనివారం రాత్రి హైదరాబాద్ వెళ్లి సోమవారం ఉదయం కలర్ ల్యాబ్ కి వస్తున్న సురేష్ హత్యను పోలీసులు ఎంక్వయిరీ చేస్తున్నారు. శనివారం సంఘటన స్థలాన్ని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తమ సిబ్బందితో పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవ సేవ

### కన్నుల పండుగగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి తిరుమల శ్రీ స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో శనివారం రోజు ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని రాత్రి ఏకాంత సేవ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. నేటి ఉదయం 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్ప మాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి దివ్యక్షేత్రం లో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులను సమర్పించారు. స్వర్ణగిరి క్షేత్రం హనుమాన్ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటలకు క్షేత్ర పాలకుడైన కార్యసిద్ధి హనుమాన్ సన్నిధియందు విశేష నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం 27 అడుగుల కార్యసిద్ధి హనుమంతు మూల విరాట్ మూర్తికి మహా క్షీరాభిషేకం లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. అనంతరం మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ



మండపంలో వేదమంత్రాల మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు దివ్యకరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ రామ చంద్రులవారికి హనుమంత వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , మానేపల్లి మురళీకృష్ణ , మానేపల్లి గోపి కృష్ణ దంపతులు కుటుంబం సమేతంగా పాల్గొన్నారు. జై శ్రీ రామ్ నినాదలతో స్వర్ణగిరి క్షేత్రం మార్మోగిపోయింది.

అనంతరం స్వామివారిని మాడవీధులలో విహరిస్తూ భక్తుల గోవింద నామాలతో తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు జాజ్వల్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమివ్వగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారికి మంగళహారతులను సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ, గోపికృష్ణలు తెలిపారు.





## రైతులకు ఇబ్బందులు రావొద్దు

**ప్రజాపక్షం/అనంతగిరి:** ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యం తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శనివారం అనంతగిరి మండలంలోని పలు రైస్ మిల్లులను అకస్మకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తరలించకుండా ప్రత్యేక టీమ్‌లు, చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, మిల్లుల నుండి ఇతర రాష్ట్రాలకు ధాన్యం తరలిస్తే ఎంతటి వారినైన ఉపేక్షించేదిలేదన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో రైతులకు ఇబ్బంది కలగకుండా వడదెబ్బ బారీన పడకుండా తగిన సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మిల్లర్ల యాజమానులు ఉన్నారు.

## ప్రభుత్వ వైద్యశాల నూతన భవనం ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/మునగాల:** మునగాల పరగాణలో ఎంతో చారిత్రిక నైపథ్యం కలిగిన ఆసుపత్రి స్వాతంత్ర ముందుగా ఏర్పాటు చేశారు. నడిగూడెం జమీందారు దగ్గర దివాన్‌గా పనిచేసిన కొమ్మరాజు లక్ష్మణ్‌రావు సోదరి అచ్చమాంబ ఈ ప్రాంతంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గాయపడిన సందర్భాల్లో కామ్రెడ్ విజయవాడ నుండి డాక్టర్ బోస్ వారి బృందం వైద్య సిబ్బంది ఇక్కడ వైద్య సేవలు చేసినట్లు ఆనాటి వాళ్లు చెప్పుకుంటున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి చిలంచర్ల ప్రభాకర్‌రావు అన్నారు. అభివృద్ధి ప్రధాత కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తో ఈ నూతన భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

## హనుమాన్ జయంతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణ కేంద్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్, బీజేవైఎం, బజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల గుండా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి హనుమాన్ భక్తిని చాటారు. హనుమాన్ జయంతి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిజెపి పార్టీ ముఖ్య నాయకులు యువకులు జై శ్రీరామ్ నినాదాలు చేస్తు సమావేశం ఏర్పాటు చేశారు. బిజెపి పార్టీ చిక్క కృష్ణ గంజి బస్వ లింగం, బల్ల దుర్వాసులు, చొక్కా రెడ్డి, తండా రమేష్, బిజేవైఎం టౌన్ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, గడ్డం మహేష్, వంగూరి సిద్ధులు, హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# హక్కులతోపాటు బాధ్యతలు గుర్తుంచుకోవాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లలో పనిచేసే డ్రైవర్ సోదరులు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకొని సక్రమంగా నిర్వర్తించాలని ఐఎన్‌టియుసి హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురువయ్య గౌడ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ రోడ్‌లో పార్‌బాయిల్డ్ మోడరన్ రైస్‌మిల్ డ్రైవర్స్ యూనియన్ (ఐఎన్‌టియుసి)అనుబంధ అధ్యక్షుడు సలిగంటి జానయ్య ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెల్లంకొండ గురవయ్య పాల్గొని మాట్లాడారు. యాజమాన్యంతో కుదిరిన నూతన అగ్రిమెంట్ గురించి వివరించారు. పారిశ్రామిక వృద్ధి కొరకు కార్మికవర్గం పాటుపడాలని,అలాగే కార్మికుల హక్కుల కోసం తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేకపోతుల వీరబాబు, కాకిలేటి సుబ్బారావు,సోమగాని బాలకృష్ణ,అమరబోయిన ప్రసాద్, సీతారాములు,గుండెబోయిన శ్రీను,గడ్డం నాగరాజు,చల్లా శ్రీను,కారింగుల అంజి, మీసాల నరేష్.,ముత్యాల వీరయ్య,గోపి,గణేష్ పాల్గొన్నారు.

# హైజాక్ ట్యాంకర్లో మంటలు..... పరిగెత్తిన కూలీలు




**ప్రజాపక్షం/అనంతగిరి:** సిసిరోడ్డు పనులు చేస్తుండగా హైజాక్ మిషన్ ట్యాంకర్‌లో వైర్లు ఫైయిల్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాలోని అనంతగిరి మండలం పాలవరం గ్రామంలో చోటు చేసుకుంది. అనంతగిరి మండల కేంద్రం నుండి చనుపల్లి వరకు రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గ్రామాల ముఖద్వారాలు వద్ద కొంతమేర సిసిరోడ్డు పనులు చేస్తున్నారు. దానిలో బాగంగానే పాలవరం ముఖద్వారం నుండి జిల్లా పరిషత్ పాఠశాల వరకు సిసిరోడ్డు పనులుగత వారం రోజులుగా చేపడుతున్నారు. శనివారం సైతం పనులు చేస్తున్నసమయంలో హైజాక్ ట్యాంకర్ (సిమెంట్ కంకర కలిపే మిషన్) విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా మిషన్‌లోని ట్యాంకర్‌కు అంటుకుని ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో పని చేస్తున్న కూలీలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. పక్కనే జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించిన లేటుగా రావడంతో గ్రామస్తులు బిందెలతో మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందించడం అభినందనీయమని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, టిటిడి దేవస్థాన మాజీ సభ్యులు సాముల రాంరెడ్డి అన్నారు. శనివారం పెంచికల్ దిన్నె కృష్ణకుమారి ట్రస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయడం హర్షణీయమన్నారు. మహిళల ఆర్థిస్వాలంబన కోసం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పెంచికల్ దిన్నె కృష్ణకుమారి ట్రస్టుకు రూ.1లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. ప్రభుత్వ పరంగాకూడా సాకారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ట్రస్టు ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ సుంకర క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు, నెట్టే సత్యనారాయణ, కుక్కడపు కృష్ణ, అంబటి శ్రీనివాస్ రెడ్డి, కవి మందగామ రత్నకుమార్, సుంకర ప్రదీప్తి, అరిబండి సావిత్రి, మహిళలు పాల్గొన్నారు.

# సగరపు ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



**ప్రజాపక్షం/చివ్వెంల:** మండలంలోని మోదీంపురం గ్రామానికి చెందిన తెలంగాణ హైకోర్టు న్యాయవాది సగరపు ప్రసాద్ కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ ద్వారా లీగల్ స్టడీస్‌లో పిహెచ్‌డి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధుల చేతులమీద నుండి పట్టా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం, న్యాయవ్యవస్థ, లీగల్ స్టడీస్ పిహెచ్‌డి (హన్స్)ను తాను అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాయ్యం అనేది సమాజంలో ప్రజల ప్రవర్తనను నియంత్రించడానికి, రక్షించి న్యాయం అందించడానికి ఉపయోగించే నియమాలను సూచిస్తుందన్నారు. చట్టం, న్యాయం గురించి చదువుకోవడం, అధ్యాయనం చేయడం రానున్న రోజుల్లో సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లీగల్ స్టడీస్ ఒక వ్యక్తికి చట్టం, న్యాయం గురించి అవగాహన కల్పిస్తుందన్నారు. దీని గురించి మరింత తెలుసుకోవడానికి చట్టం న్యాయంపై ఆధారపడి ఉన్న వివిధ వృత్తులు, పరిశోదన కూడా సహాయపడుతుందన్నారు. గౌరవ డాక్టరేట్ అందుకున్న సగరపు ప్రసాద్‌ను పలువురు వేర్వేరు ప్రకటనలో అభినందించారు.



## కూలీలందరికి ఉపాధిహామీ పనులు

**ప్రజాపక్షం/మునగాల:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలందరికి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కలపల్లి రాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మునగాల మండల కేంద్రంలో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. వ్యవసాయంలో యంత్రాలు వచ్చిన తర్వాత కూలీలకు పనులు దొరక్క వలసలు పోతున్నారని, వలసలు నివారణ కోసం యుద్ధప్రతిపాదికన ఉపాధిహామీ పనులు వెంటనే ప్రారంభించి కూలీలకు పని కల్పించాలని కోరారు. వేసవిలో పని ప్రదేశంలో టెంటు, మంచినీటి సౌకర్యం, పారలు, గడ్డపారలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సొంపంగు జానయ్య, ఆరె.రామకృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, వెంకటయ్య, ఉపాధిహామీ మేట్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే విద్య




**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వ బడిలోనే నైపుణ్యమైన విద్య దొరుకుతుందని కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్కేండేయ అన్నారు. శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలోని అర్టీసీ బస్టాండ్, నయానగర్, ముస్లీం బజార్‌లో ప్రాథమిక పాఠశాలల నందు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్, రెండు జతల దుస్తులు అందిస్తుందన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మా బడిలో చేరి మంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, లైబ్రరి, విశాలమైన తరగతి గదులు, అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష్మినారాయణరెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది చింతకుంట్ల లక్ష్మినారాయణ రెడ్డిని లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మినారాయణ రెడ్డి భవిష్యత్‌లో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కనగాల నాగేశ్వరరావు, రామినేని శ్రీనివాసరావు, యలమందల నర్సయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, నర్సింహరావు, విలాసకవి నర్సరాజు, దొంగరి శ్రీను, కోటేశ్వరరావు, భూక్య వెంకన్న పాల్గొన్నారు.

## నేడు శివాజీ విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహావిష్కరణ నేడు నిర్వహిస్తున్నట్లు శివాజీ యువజన మండలి అధ్యక్షులు కోరె మల్లేశం, ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బూడిది బిక్షమయ్య గౌడ్, అఖిల పక్ష నాయకులు పాల్గొంటారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



## ఓలేశ్వర స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం లోని అనాజిపురం గ్రామంలో శ్రీ ఓలేశ్వర స్వయంభు లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్స వానికి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డికి హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు శ్రీరాం, శరత్ యాదవ్ పైళ్ళ శేఖర్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి కూతురు పెళ్లికి హాజరైన ప్రముఖులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మాడుగుల ప్రభాకర్ రెడ్డి కూతురు పెళ్లికి పలు రాజకీయ పార్టీల ముఖ్య నాయ కులు హాజరై నవవధువులను ఆశీర్వదించారు. హైదరా బాదు శంషాబాద్‌లోని కెవిఎల్ సిసి కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగిన వివానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తడక వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, పార్లమెంటరీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ యాదవ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంక టేశ్వర్ రెడ్డి, పలు రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు హాజరై నవవధులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గావ్‌చలో బస్తీ చలో అభియాన్

**ప్రజాపక్షం/చండూరుః** భారతీయ జనతా పార్టీ తలపె ట్టిన గావ్‌ఛలో బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా శని వారం బిజెవైఎం రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలో గల బోడంగిపర్తి గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ,అంగన్వాడీ సెంటర్ ను సందరర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సెంటర్‌లో గత పది రోజుల నుండి లబ్ధిదా రులకు కోడి గుడ్లు సరఫారా చేయడం లేదని సంబం ధిత అధికారులతో నరేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కట్కూరి రామ లింగయ్య , సరికొండ సైదులు , బరిగెల లింగస్వామి, పెద్ద సైదులు , వరికుప్పల మహేష్ , సాగర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్‌పై ఎంఎల్‌సి కవిత అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** జనసేన అధినేత, ఏపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గురించి ఓ ఇంట ర్వ్యూలో సీనియర్ రాజకీయ నేత కాదని ఎదో డిప్యూటి సిఎం అయ్యాడని ఎంఎల్‌సి కవిత చేసిన అనుచిత వాఖ్యలు సరి కాదని హుజూర్‌నగర్ నియో జకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సరికొప్పుల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపి రాష్ట్రం ఏ మూలకు పోయిన పవన్ కళ్యాణ్‌కు ప్రజలు నిరాజనం పడుతున్న విష యాన్ని ఆమెకు తెలియకపోవడం విచారకమన్నారు. తెలుగు ఇండస్ట్రీస్‌లో ఆయనకున్న గుర్తింపు, వేల కోట్ల రూపాయల ఆస్తులను వదిలేసి రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవలు చేస్తున్నారని అన్నారు. కవిత దృష్టిలో సీనియర్ పోలిటేషన్ అంటే స్కాంలు, స్కీంలు, జైలు జీవితం గడపడమేనా అంటూ ఎద్దేవ చేశారు. కెసిఆర్ కుతురుగా ఆమెకు ప్రజల్లో ఉన్న గౌరవం ఈ ఒక్క మాటతో మంట కలిసిందన్నారు. ఇకనైనా ఆమె నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడా లని లేకుంటే జన సైనికులు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయ కులు కొమ్మరాజు శ్రీను, దాసరి వాసు నాయుడు, వెంకట్, సాయి చరణ్, మచ్చ పవన్ కళ్యాణ్, రాకేష్ నాయుడు, అంజి, వెంకన్న పాల్గొన్నారు.

## గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కూరెళ్ళ సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం అని చెప్తూ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ పై రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణ యాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 11 సంవత్సరాలలో వంట గ్యాస్ ధర 130 శాతం, 51 శాతం పెట్రోల్, 74 శాతం డీజిల్ ధర పెరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచడం వలన ప్రజ లపై మోయలేని భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్య దర్శి తుమ్మలగూడెం యాదయ్య, మర్రిపల్లి మల్ల య్య, పొన్నం రాజమల్లు, మారుపాక సత్తయ్య, భాష బోయిన నరసయ్య, బూరుగు బాసయ్య, కూరెళ్ళ పాపయ్య, కూరెళ్ల నరసయ్య, కూరెళ్ళ నాగయ్య, తుమ్మలగూడెం గీత, కూరెళ్ళ మారమ్మ, నార్కెట్పల్లి లక్ష్మి , కూరెల సున్నిత పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్లతుర్తి క్రాస్ రోడ్డులో నిర్వహించనున్న బీఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయా లని మాజీ ఎమ్మెల్య నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణలంలోని రెడ్డి కాలనీ బీఆ ర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లా డారు. కేసీఆర్, కేటీఆర్ ఆధ్వర్యంలో సభను విజయ వంతం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చా లని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని కాని నేటీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా రని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నభీ మోజు నాగార్జునచారి, మగ్గుంపాషా, ఇలియాస్ ఖాన్,అయిల వెంకన్న, తలకోన శ్రీధర్‌రెడ్డి, పిన్నబో యిన శ్రీనివాస్‌యాద్, భీమ్లానాయక్, దినేష్, ప్రసాద్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర హనుమాన్ శోభాయాత్ర



**ప్రజాపక్షం /భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయత్ర శోభయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. భువనగిరి పెరుమాండ్ల హనుమాన్ దేవాలయం నుండి ప్రారం భమైన ర్యాలీ భువనగిరి పట్టణంలో పురవీధుల గుండా తిరిగి జగదేవపూర్ రోడ్డులో గల అంజనాద్రి హనుమాన్ దేవాలయం వరకు కొనసాగింది. సామూ హిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భువనగిరి జిల్లా అధ్యక్షులు పోత్నక్ రాఘవేందర్, బజరంగ్దళ్ యాదాద్రి జిల్లా కన్వీనర్ బింగి భరత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోల శ్రీనివాస్ గుప్తా భువనగిరి జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం యాదవ్ జిల్లా కోశా ధికారి చామ రవీందర్ ఉపాధ్యక్షులు పసునూరి మనోహర్ సామాజిక సమరసత కన్వీనర్ కేమోజు మల్లికార్జున చారి లీగల్ సెల్ కన్వీనర్ సాల్వేరు వేణు సత్సంగ్ ప్రముఖ్ పెద్ద గాని శ్రీనివాస్ పట్టణ అధ్య క్షులు కందికొండ సహదేవ్ భువనగిరి అంజయ్య అర్చక పురోహిత జిల్లా ఆకుల అనిల్ వల్లబోజు సతీష్ రెడ్డబోయిన బాలరాజు వివిధ ప్రఖండల అధ్యక్ష కార్యదర్శులు బజరంగ్దళ్ సహ సంయోజక్ మార్క శ్రవణ్ నగర సంయోజక్ నమిలే నవీన్ బజరంగ్దళ్ కార్యకర్తలు మేకల భాను జడల అక్షయ్ అవినాష్ పూస శ్రీనివాస్ కుచ్చుల గోపి అరుణ్ కుచ్చుల రాఖి ఆర్ఎస్ఎస్ బజరంగ్దళ్ హిందువాహిని ఏబీవీపీ ముఖ్య కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలు హిందూ బంధువులు పాల్గొన్నారు.



## గుర్రాల ఫౌండేషన్ మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** హన్మాన్ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణం లోని స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద గుర్రాల ఫౌండే షన్ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గుర్రాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవ కార్యక్రమలొ చేస్తున్న ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సమ యంలో ఎన్నో సేవా కార్యక్రమం చేశారు అని తెలిపారు. ఈ కార్య క్రమంలొ మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, తాంగేళ్లపల్లి రవి కుమార్, కూర వెంకటేష్ ఈరపాక నర్సింహా, వాడిచార్ల కృష్ణ యాదవ్, తాడూరి నర్సింహా, హీరకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీమంతం అన్నప్రాసన,అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/నిడమనూరు:** మండల పరిధి మేడం సెక్టార్ రాజన్న గూడెం అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలింతలకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు, ఈ సంద ర్భంగా బాలింతలు, గర్భిణీలు తీసుకోవాల్సిన పోషక పదార్థాలు, జాగ్రత్తలు గూర్చి వివరించారు, బలహీనంగా ఉన్న పిల్లల విష యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి తెలియజేశారు, ఈ కార్య క్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ ఉదయశ్రీ, సూపర్వైజర్ సైదా బేగం ఏఎన్ఎం మమత అంగన్వాడి టీచర్లు జె రాజేశ్వరి, ఝాన్సీ లక్ష్మి రాణి,సునీత,పద్మ, రాధా,లలిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు చండూరు మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

### హాజరుకానున్న ఎంఎల్‌సి సత్యం , ఎంఎల్ఏ రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నేడు చండూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవ రణలో సాయంత్రం నాలుగు గంటలకు పదవి ప్రమాణ స్వీకారం చేయనున్నారని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీస్ కుమార్ తెలిపారు.మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దోటి నారా యణ, వైస్ చైర్మన్‌గా పోలు వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లుగా చండూరు మండలానికి చెందిన సిపిఐ నాయకులు నల్పరాజు రామలిం గయ్య, మునుగోడు మండలానికి చెందిన బొమ్మరగోని మంగమ్మ పదవి ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం , మునుగోడు ఎంఎ ల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు అవుతున్నందున సిపిఐ నాయకులు ,కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సతీష్ కుమార్ కోరారు.

## ఘనంగా మహనీయుల జయంతి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపల్ కేంద్రంలోని పిఎంశ్రీ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహనీయులు జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వీరబాబు, ఎం సైదులు, జానకిరాములు, అన్నపూర్ణ, నర్సింహ్మారావు, మాధవి, భారతీ, విద్యార్థులు పాల్గొన్నారు.





## నేతి సత్యనారాయణకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన నేతి సత్యనారాయణను, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డిని శుక్రవారం పీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ మెరుగు శ్రీనివాస్, నాయకులు గంధం రామకృష్ణ, అజహర్, ఎం.ఎ.ఆరిఫ్, మాలి కాంతారెడ్డి, జెల్లా వెంకటేశ్వర్లు, గోపి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ వితరణ




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పోచంపల్లి మండలం జలాల్‌పురం ప్రాథమిక పాఠశాలకు శనివారం జాంభవ యూత్ అసోసియేషన్ సభ్యులు స్పోర్ట్స్ ఐటమ్స్ వాటర్ ట్యాంక్ సింటెక్స్ లి.500 ఇతరులు చేశారు. ఈ కార్యక్రమంలో గోరంటి ప్రదీప్ రెడ్డి, శాపాక బిక్షపతి శాపాక శంకర్, శాపాక స్వామి, అధ్యక్షులు శాపాక జంగయ్య, ఉపాధ్యక్షులు మహంకాళి శ్రీకాంత్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబందించిన ప్రభుత్వం వంట పాత్రలు అందించడం శుభపరిణామం అని మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్యా నాయక్ అన్నారు. శనివారం ప్రభుత్వం మండలంలోని పాఠశాలలకు సంబందించిన మధ్యాహ్న భోజన వంట పాత్రలను మండల విద్యావనరుల కేంద్రంలో ఉంచినట్లు తెలిపారు. ఈ వంట పాత్రలను ఆయా పాఠశాలలకు అందించనున్నట్లు గోప్యానాయక్ తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , విద్యా కమిటి చైర్మన్‌లు, ఎంఆర్‌సి సిబ్బంది, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## మాసకళ్యాణం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పౌర్ణమిని పునస్కారించుకుని దేవతామూర్తులకు మాసకళ్యాణం ఆలయ అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ జరిపించారు. అధేవిధంగా శనివారం ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి ఆకు పూజను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గోన్నారు.

# మహనీయుల ఆశయాల సాధనకు కృషి



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** యువత సన్మార్గంలో నడుస్తూ త్యాగధనుల ఆశయాల సాధనకు కృషి చేయాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సూచించారు. శనివారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జయంతి ఉత్సవాల సందర్భంగా డ్రగ్స్ నివారణ కెరీర్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని పార్టీ ప్రదేశ్ ఎస్‌సి,ఎస్‌టి సెల్ ఆధ్వర్యంలో డాక్టర్ మదిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డిఎస్‌పి శివరాం రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు నరసింహారావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. యువత సన్మార్గంలో నడుస్తూ త్యాగధనుల ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అనేక సామాజిక రుగ్మతలకు వ్యక్తిగత క్రమశిక్షణ లేని మరియు స్పష్టమైన లక్ష్యాలు లేకపోవడం అన్నారు. బాధ్యతాయుతమైన పౌరులు గా తమ స్వీయ సంరక్షణతో పాటు దేశ సామాజిక రాజకీయ సాంస్కృతిక అంశాలలో ప్రగతిశీల క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు సైబర్ క్రైమ్ కు, లింగ వివక్షలు హింసకు వ్యతిరేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవాల చైర్మన్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,డాక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రేమ్సాగర్, సిహెచ్ సుధారాణి, అరుణప్రియ, సిఓఈడాక్టర్ ఉపేందర్ రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ వై ప్రశాంతి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్ కుమార్, మారం వెంకటరమణారెడ్డి, తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా అంజనిపుత్రుడు,రామదూత హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాలలో ఆభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. భక్తులకు అర్చకులు హనుమాన్ చాలీసా గొప్పతనం గురించి వివరించారు. హుజూర్‌నగర్ పురవీధులలో డీజే మోతలతో,డప్పుచప్పుళ్ళతో జైశ్రీరామ్ అంటూ జైభజరంగ్ భారీ ర్యాలీని నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ పట్టణ పురవీధులు మార్మోగాయి. అలాగే హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురంలో వేంచేసిన అభయ ఆంజనేయస్వామికి మాన్యుసూక్తం మంత్రంతో అభిషేకం,సింధూరంతో అలంకరించి నాగవల్లీ దళాలతో సహస్త్రనామార్చన వంటి మహోత్తరమైన పూజాకార్యక్రమాలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన పులిహోర,దద్దోజనం ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం నీరాజనమంత్ర పుష్పం,భక్తులకు తీర్థప్రసాదలను వినియోగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహాచార్యులు,ఈవో చలపతిరావు,భక్తులు పాల్గొన్నారు.

# కోదాడలో గులాబీ జెండా ఎగరడం ఖాయం



**ప్రజాపక్షం/మోతె:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు శీలం సైదులు యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని సర్వారం గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర్ రావు నివాసంలో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్లతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ మహాసభలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాడాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మడ్డి మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు జానీపాషా, నాయకులు గుగులోతు శంకర్ నాయక్, మైనంపాటి శ్రీనివాస్ రెడ్డి, పల్స మల్సూర్ గౌడ్, మిక్కిలినేని సతీష్, మాజీ సర్పంచ్‌లు నర్సింహారావు, గాంధీ, లింగయ్య పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/మోతె:** క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మవతి అన్నారు. శనివారం మండలంలోని బిక్యాతండ గ్రామంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిత్యం విధుల్లో ఉంటూ ముందుకు సాగుతున్న కార్యదర్శులు క్రీడలపై కుడా ఆసక్తి చూపాలన్నారు. ఒకే వేదికపై క్రీడల్లో పాలుపంచుకోవడం స్నేహబంధాలు పెంపొందుతాయన్నారు. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

**చెక్కుల పంపిణీ...**

మండల కేంద్రంలోని శ్రీశక్తి భవన్ కార్యాలయంలో మండల పరిధిలోని అర్హులైన లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ ల క్ష్మీ , షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ఆంజనేయులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాతృ నాయక్, లలితభాస్కర్ పాల్గొన్నారు.





## భజన పోటీలలో అన్నమయ్య భజన మండలి ప్రథమస్థానం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని గరిడేపల్లి మండలం గడ్డిపల్లి లోని అరవిందమాత 53వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన భజన పోటీలలో హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన శ్రీ అన్నమయ్య భజన మండలి వారు ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. అన్నమయ్య భజనమండలి సభ్యులచే నిర్వహించిన సంగీత గానాల హరి,భక్తి గీతాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం హుజూర్‌నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీఅన్నమయ్య భజన మండలి వ్యవస్థాపక అధ్యక్షులు బాచిమంచి కొండయ్య అనంతలక్ష్మి ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు వెన్న పద్మ,చారి, ఆండాలు, రంగమ్మ, వెంకటరమణ,ఆలయ అర్చకులు నరసింహాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** పార్టీ కోసం కష్టపడ్డ వారి కోసం తాను కడదాక ఉంటానని పదే పదే చెప్పుకొచ్చే మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆ మాటకు కట్టుబడి ముందుకు సాగుతున్నారు. నాయకులు, కార్యకర్తలకు కష్టాలు రాగానే నేనున్నానంటూ ముందుంటున్నారు. గత ఏడాది క్రితం హత్యకు గురైన సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డె ఎల్లయ్య కుటుంబానికి రూ. 1.5లక్షల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. తాను అందుబాటులో లేకున్నా స్థానిక నాయకుల చేతుల మీదుగా ఆ సొమ్మును పట్టణ పార్టీ అధ్యక్షులు ఎండి అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌ల చేతుల మీదుగా అందజేయించి తన ఉదారతను మరోమారు చాటుకున్నారు.

## చిరు ధాన్యాలతోనే పోషక విలువలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** చిరు ధాన్యాలతోనే పోషక విలువలు లభిస్తాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ మంగ, పల్లె దవాఖాన వైద్యులు తేజలు అన్నారు. శనివారం తుంగతుర్తి ఐసిడిఎస్ పరిధిలోని గానుగుబండ, తూర్పుగూడెం అంగన్వాడీ కేంద్రాల్లో పోషణపక్షంలో భాగంగా పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పోషక పక్వాడ అనేది ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీలో అందిస్తున్న పోషక విలువలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిబిడ్డలకు అందించే ఆహారం, చిరు ధాన్యాల వల్ల కలిగే మేలుపై వివరించారు. గర్భందాల్చిన మహిళలు రాగులు, సజ్జలు, కొర్రలు వంటి వాటిని తినడంతో ఐరన్, పిండి పదార్థాలు అధికంగా లభిస్తాయన్నారు. వీటిని క్రమం త ప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు గుండగాని శోభ, బింగి జ్యోతి, పోలేపాక అంజలి, ఆయాలు డి మణెమ్మ, ఎ ముత్తయ్య, ఎఎన్ఎంలు పి జయమ్మ, ఎ స్వర్ణలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని వినోబా మందిర్ కాలనీకి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు వల్లభదాసు రాజు ఇటీవలే బ్రెయిన్ స్ట్రోక్ తో మరణించారు. బాధిత కుటుంబానికి ఆసరాగా మానవతా దృక్పథంతో సామాజిక సేవలో భాగంగా శనివారం, సోషల్ సర్వీస్ కన్వీనర్ ప్రతినిధి సీత మురళి బియ్యం నిత్యవసర వస్తువులు అందజేశారు.

## చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్ ఐదుగురి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్రావు, మాజీ మాల్ మార్కెట్ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి, వైస్ చైర్మన్, నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజా పక్షం/నలగొండ టౌన్:** నల్లగొండ మండలం దండంపల్లి గ్రామానికి చెందిన పెందోటి శంకర్ కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మంజూరైన 60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ జెడ్పిటిసి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగూరి లక్ష్మయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుంకరబోయిన పర్వతాలు, కాంపల్లి కృష్ణ, పోలే శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# యువత కొత్త ఆలోచనలు చేద్దాం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** Young India young leadership శనివారం సాయంత్రం భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో MJPTBCR డిగ్రీ కళాశాలలో (MEN)లో young India young leadership (ONE STOP SOLUTION FOR YOUTH) ఎన్జీవో ఆర్గనైజేషన్ 9వ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. చావా రాజ్ కుమార్ మాట్లాడుతూ Lead Today change Tomorrow అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ, యువత మీలో కొత్త ఆలోచనలు చేద్దాం దేశ అభివృద్ధిలో పయనిద్దాం అన్నారు. మీ ఆలోచనలు సకారం చేసే ఇది ఒక చర్చవేదిక young India young leadership నూతన ఆశయం, ఆలోచనతో మా ముందుకు రండి మీ ఆశయానికి మేము దిక్సూచి అవుతాం అని అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధగాని మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధికి భవిత,




యువతలో ఉన్న కొత్త ఆలోచనలు దేశ అభివృద్ధికి సోపానాలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపల్ జె.స్వప్న, వైస్ ప్రిన్సిపల్ పి నరేష్ సార్, వైస్ చైర్మన్ అంబోజు మల్లేశం సార్, జాయింట్ సెక్రెటరీ యేంపల్ల కొండల్ రెడ్డిసార్, అధ్యాపకులు మహేష్, హేమలత స్వాతి నరసింహ కృష్ణ సార్, ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్ సార్, జాయింట్ డైరెక్టర్ గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, సంపత్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్ విద్యార్థులు ప్రవీణ్, కరణ్ అనిల్, అరవింద్ పాల్గొన్నారు.

# రజతోత్సవ బహిరంగ సభ జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ఈనెల 27న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బిఆర్ఎస్వి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఒగ్గు శివ కుమార్, దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యములో ఈ నెల 14వ తేదీన రాయగిరి నుంచి యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వద్ద వరకు పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈ పాదయాత్రక సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ఎండి మున్నా, ఏర్పుల అరవింద్, ఆలేరు నియోజకవర్గం ఇంచార్జి రకాల రమేష్, భువనగిరి మండల అధ్యక్షులు కనకాల మహేష్, బిఆర్ఎస్వి బీబీనగర్ మండల అధ్యక్షులు పచ్చిమట్ల వంశీ గౌడ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరుః** ఏప్రిల్ 27న వరంగల్‌లో జరుగు బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని బిఆర్ఎస్ నాయకులకు ,కార్యకర్తలకు మునుగోడు మాజీ ఎంఎల్ఎ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చండూరు మండల కేంద్రంలోని భారతీచంద్ర గార్డెన్‌లో జరిగిన చండూరు మున్సిపల్ మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి మాజీ ఎంఎల్ఎ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మునగాల నారాయణరావు , పాల్వాయి స్రవంతి , బిఆర్ఎస్ కార్మిక విభాగం సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న పాల్గొన్నారు.





## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

**ప్రజాపక్షం/ హాలియా:** రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్సై సతీష్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం హాలియా పరిధిలోని వజ్రతేజ రైస్ మిల్ వద్ద ధాన్యం అమ్మకానికి వచ్చిన ట్రాక్టర్ యజమానులకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం చెట్ల చెన్నారం పులిమామిడి మధ్య జరిగిన రోడ్డు ప్రమాదం మూలంగా ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. రహదారుల వెంట వాహనాలను ఆపినప్పుడు వాటికి వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలని సూచించారు. ఆయన వెంట కానిస్టేబుల్ రమేష్ ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని పిఏసిఎస్ ఆధ్వర్యంలో పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు, అధికారులతో కలిసి పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవో లక్పతి, ఏఈవో వనిజ ప్రవీణ్, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, తిరుపతిరెడ్డి, వెంకులు, వెంకన్న, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి

**ప్రజాపక్షం/గుండాల;** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 అదనంగా పెంచడం వలన సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం పడుతుందని తక్షనమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా ధరలను పెంచుకుంటూ పోతుందని ఆయన విమర్శించారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజల మీద మాత్రం ఆర్థిక భారం మోపుతుందని అన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల పరిధిలోని లక్ష్మీదేవి కాల్వ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి దేవాలయంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లంబట్ల పూర్ణచందర్రావురమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిరం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గంగరాజు, వల్లంభట్ల రవీందర్, ఆంజనేయులు, నాగయ్య, వేణు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీ వీరాంజనేయ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హనుమంతునికి ఆకు పూజ చందూరం పూజలతో పాటు అర్చనలు చేసి స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని గూడూరు గ్రామంలో కాశీ విశ్వేశ్వర ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి హనుమాన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోటోల శ్యామ్ గౌడ్, గడ్డం బాల్‌రెడ్డి, గూడూరు నిఖిల్ రెడ్డి, బద్దం వాజీవ రెడ్డి, పాలకూర శ్రీనివాస్ గౌడ్, బోయపల్లి నరసింహారెడ్డి, సత్యం గౌడ్, వనం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.





**ప్రజా పక్షం/ నలగొండ టౌన్ :** హనుమాన్ జయంతి సందర్భంగా పాతబస్తీ హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమైన హనుమాన్ విజయోత్సవ యాత్రలో నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి శోభా యాత్ర ను ప్రారంభించారు.భారీ సంఖ్యలో హనుమాన్ భక్తులు పాల్గొన్న ఈ శోభాయాత్ర వీటి కాలనీలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ముగిసింది.ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు, భువనగిరి దేవేందర్ , మాజీ కౌన్సిలర్లు,గుండ్రెడ్డి యుగంధర్ రెడ్డి రావల శ్రీనివాస్ రెడ్డి, మెరుగు గోపి బొజ్జ వెంకన్న, తవిటి కృష్ణ,బీపంగి



కిరణ్,సురేష్ రెడ్డి,, రాయల రమేష్,నరసింహ, పిల్లి శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే హనుమాన్ ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. హనుమాన్ జయంతిని పురష్కరించుకొని మండల కేంద్రంలో నిర్వహించిన హనుమాన్ శోభా యాత్రలో స్థానిక ఎస్ఐ సైదులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో శోభా యాత్రను నిర్వహకులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు శేఖర్ తదిరులు పాల్గొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చండూరు:** రెవిన్యూ డివిజన్ కేంద్రమైన చండూరులో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటు చేయాలని బిజెపి అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కాసాల జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన చండూరులో మాట్లాడుతూ నాంపల్లి ,మునుగోడు , మర్రిగూడెం, గట్టుప్పల, చండూరు మండలాలకు చెందిన ప్రజలు దూర ప్రాంతాలైన దేవరకొండ, నల్లగొండ కోర్టుకు వెళ్లకుండ అన్ని అవకాశాలు ఉన్న చండూరులో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధిః జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ఇటిక్యాల ఎస్ ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం గద్వాలలోని శివ కేశవ్ నగర్ కు చెందిన కళ్యాణ్ కుమార్ శుక్రవారం పోస్ట్ ఆఫీస్ లో విధులు నిర్వహించుకుని రాత్రి వల్లూరులో జరిగిన బంధువుల శుభకార్యానికి భార్య బంధువులు వెళ్లి. అక్కడే ఉండడంతో బట్టలు పెట్టుకునేందుకు ద్విచక్ర వాహనం పై గద్వాల నుంచి బయలు దేరాడు. జింకల పల్లె స్టేజీకి సమీపంలోని మామిడి తోట దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కళ్యాణ్ కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నాడు. కాలనీలో అందరితో కలుపుగోలుగా ఉండే యువకుడు అకాల మృతితో శోక సముద్రంలో మునిగిపోయారు. జరిగిన సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విజ్ఞాన్ ప్రవేశపరీక్ష వీశాట్ 2025 ఫేజ్1 ఫలితాలు విడుదల




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్,గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలలో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చరల్, ఫార్మా డీ ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన వీశాట్ 2025 ఫేజ్1 ఫలితాలను విడుదల చేసినట్లు విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్ పి నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటి కౌన్సిలింగ్ ఈనెల 16 నుంచి 20 తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. తాము నిర్వహించిన విజ్ఞాన్ స్కోలాస్టిక్ యాప్టిట్యూడ్ టెస్ట్ కు ఈ ఏడాది అనూహ్య స్పందన లభించిందని అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీశాట్ 2025 ఫేజ్ 1 ప్రవేశ పరీక్షను ఆన్లైన్, ఆఫ్లైన్ ద్వారానే నిర్వహించామన్నారు. ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు వీశాట్కు హాజరైనట్లు చెప్పారు. 85 శాతానికిపైగా విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం, పరిశోధనల్లో సత్తా చాటుతుండటంలాంటి అరుదైన విజయాంశాల వల్లనే విద్యార్థులు, తల్లిదండ్రులకు తమ యూనివర్సిటీపై ఆదరణ మరింత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. వీశాట్ 2025 ర్యాంకులతో పాటు జేఈఈ మెయిన్స్ ఫలితాలు, ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్మీడియట్ మార్కులను కూడా పరిగణలోనికి తీసుకుంటామని పేర్కొన్నారు. వీశాట్2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు యూనివర్సిటీ వెబ్సైట్ https://vignan.ac.in/vsatresult/ కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే విద్యార్థుల సెల్ఫోన్లకు ర్యాంకులు వివరాలను పంపిస్తామని తెలియజేసారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు..రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్, డెప్యూటీ రిజిస్ట్రార్, డైరెక్టర్ అడ్మిషన్స్ అప్పారి గౌరీశంకర్రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు ఫలితాలు విడుదల చేసిన వారిలో ఉన్నారు.

## శ్రామికవర్గ రాజ్య స్థాపనే లభ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** శ్రామికవర్గ స్థాపనే తమ లక్ష్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ మల్లు వెంకటనర్సింహ్మారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలో వచ్చిన నాటి నుండి మత, కుల ఘర్షణలు మహిళలపై దాడులు పెచ్చురిల్లుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని మనువాద, కార్పొరేట్ విధానాలను అనుసరిస్తూ బిజెపి ముందుకు సాగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తు కార్మిక, శ్రామిక వర్గాన్ని దోచుకుంటుందన్నారు. శ్రామికవర్గ స్థాపనే లక్ష్యంగా తాము ముందుకు సాగుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11 నుండి 14వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో సామాజిక అధ్యాయన యాత్ర తాము చేపట్టనున్నట్లు తెలిపారు. సామాజిక న్యాయ పోరాటం బలోపేతం, ప్రభుత్వ రంగ రిజర్వేషన్లను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన బిజెపి ప్రభుత్వం పేదలపై పెనుభారం మోపిందన్నారు. రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు ఒక్క మాట మాట్లాడకపోవడం ఎంత వరకు సబబు అని అన్నారు. హెచ్‌యుసి ఫార్మ, రామోజీ భూముల విషయంలో సిఎం రేవంత్ రెడ్డి స్పందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి , జిల్లా కార్యదర్శి నాగార్జున్ రెడ్డి పాల్గొన్నారు.



## పూలేకు నివాళులు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో బీసి బలహీన వర్గాల సంక్షేమ సంఘం, ఎమ్మార్పియస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావ్ పూలే 198వ జయంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ బలహీన వర్గాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం కురుమ, ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, శివాజీ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ పాల్గొన్నారు.

## రామయ్య మరణం బాధాకరం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** ఖమ్మంలో మరణించిన ప్రకృతి ప్రేమికులు పద్మశ్రీ వనజీవి రామయ్య చిత్రపటానికి పర్యావరణ ప్రేమికులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రకృతి ప్రేమికులు నల్ల చంద్ర స్వామి మాదిగ, కానుగంటి శ్రీశైలం, ఎలిమినేటి నగేష్, కౌకుంట్ల మధుసూదన్ రెడ్డి, పైళ్ల పద్మా రెడ్డి, శ్రీధర్, కసరాబోయిన సత్తయ్య, బత్తిని నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోదాడ:** వనజీవి రామయ్య మరణం పట్ల స్థానిక తేజా టాలెంట్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం సంతాపం తెలిపి నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/ నార్కట్‌పల్లి:** వనజీవి రామయ్య మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని బిఆర్‌యస్ పార్టీ రాష్ట్రా నాయకులు , జిల్లా గ్రంథాలయ శాఖ మాజీ అధ్యక్షులు రేగట్టే మల్లిఖార్జున్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిత్యం పచ్చదనాన్ని కోరుకునే వనజీవి, కుమ్మరి కులానికి చెందిన రామయ్య శనివారం హఠాన్మరణం చెందడంతో నార్కట్‌పల్లి మండల కుమ్మరి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మనగోటి వెంకన్న , రమేష్ వారికి నివాళులు అర్పించారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాల నందు విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని పాఠశాల చైర్మన్ సూచించారు. శనివారం ఎర్రవల్లి చౌరస్తాలోని సరస్వతి ఇంటర్నేషల్ పాఠశాల నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో చైర్మర్ వీర గోవర్దన్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఒత్తిడితో కూడిన విద్యను ప్రైవేటు పాఠశాల బోధిస్తుండడం తగదన్నారు. సృజనాత్మకతతో కూడిన విద్యను అందించినప్పుడే విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తితో పాటు భవిష్యతులో ప్రయోజకులవుతారని అన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను తిలకించి విద్యార్థులకు మెమెంటోస్ సర్టిఫికెట్ ప్రధానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మధులిక రెడ్డి, ప్రిన్సిపాల్ నందిని కేని, అధ్యాపక బృందం విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.



## నా భర్త మృతికి హిజ్రానే కారణం

### హాస్పిటల్ ముందు ప్రధాన రహదారిపై న్యాయం చేయాలని ధర్నా చేపట్టిన భార్య కృష్ణవేణి



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధిః** తన భర్త మృతికి ట్రాన్స్ జెండర్ శివానియే కారణమని, ఆమెను సత్వరమే అదుపులోకి తీసుకొని మా కుటుంబానికి న్యాయం చేయాలని, మల్దకల్ మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రామకృష్ణ భార్య కృష్ణవేణి పెట్రోల్ డబ్బా పట్టుకొని కన్నీరు మున్నీరయ్యారు. లేనిపక్షంలో నా పిల్లలతో కలిసి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని, రెండు రోజులు కావస్తున్న అనుమానితులను అదుపులోకి తీసుకోకుండా మా భర్త శవాన్ని పోస్టు మార్టంకు తొందర పెడుతున్నారని, గద్వాలకు చెందిన హిజ్రా శివానీతో నా భర్త కొంతకాలంగా మాట్లాడడం లేదని, మేము శభకార్యానికి వెళ్ళగా అదును చూసి శుక్రవారం ఉదయం ఆటోలో వచి చిత్ర హింసలకు గురి చేశారన్నారు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆటోలో శివానితో పాటు మరో ముగ్గురు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారని హాస్పిటల్ లో జాయిన్ చేసిన అనంతరం ఆమె పారిపోయారన్నారు. తనకు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని, న్యాయం చేసేంతలరకు ఇక్కడే ఉంటామని ఆమె కటుంబ సభ్యులు, బంధువులతో ప్రధాన రహదారి పై ధర్నా చేపట్టారు. సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐ నందీకర్, కళ్యాణ్ రావు, శ్రీకాంత్ సిబ్బందితో కలిసి రాకపోకలకు అంతరాయం కలగకుండా వారికీ న్యాయం చేస్తామని, శాంతింప జేసే ప్రయత్నం చేసినప్పటికీ, వినకపోవడంతో పోలీసులకు ఆందోళనదారులకు తోపులాట చోట చేసుకుంది. ట్రాన్స్ జెండర్ శివాని పరారీలో ఉన్నారని, వారి తోటి ద్వారా ఆమె ఆచూకీ కనుగోనే ప్రయత్నం చేస్తున్నామని, త్వరలోనే ఆమెను అదుపులోకి తీసుకోని మీకు న్యాయం చేసేలా కృషి చేస్తామని సీఐ టంగుటూరి శ్రీను, బాధిత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. పోస్టు మార్టం రిపోర్ట్ ఆధారంగా చిత్రహింసలకు గురి చేశారా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే అంశం పై స్పష్టత వస్తుందన్నారు. ఇప్పటికే కేసు నమెదు చేసి సీసీ కెమెరాలు ద్వారా వారి పై నిఘా పెట్టామని, త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు.

## ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని గొల్లగూడ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు అన్నారు. శనివారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం గొల్లగూడ ఆధ్వర్యంలో దోమలపల్లి, అన్నేపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను మంత్రి ఆదేశాల మేరకు డైరెక్టర్లతో కలిసి ఆయన ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు దేప వెంకటరెడ్డి,సయ్యద్ హాశం, రుద్రాక్షి వెంకన్న, మందడి వెంకట్ రెడ్డి, చింత ఎల్లయ్య,దోటి అంజయ్య,సెక్రటరీ అనంత రెడ్డి పాల్గొన్నారు.



# దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



**-కోల్డ్ స్టోరేజీ, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దొరన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలో పర్యటించారు. ముందుగా ప్రకాష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీని ప్రారంభించి 58వ డివిజన్ దొరన్న కాలనీలో టియుఎఫ్ ఐడిసి నిధులతో కోటి రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు, స్మార్ట్ వాటర్, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరన్న కాలనీలో కావాల్సిన మేరకు పెండింగ్ పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. మొదటి విడతలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని పేదలకు దశల వారీగా ఇండ్లు పంపిణీ చేస్తామన్నారు. పేదల కోసం ప్రతిపాదించిన ప్రతి పనిని పూర్తయ్యేందుకు స్థానిక ఎంపితో కలిసి కృషి చేస్తానన్నారు. పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ గత 16 నెలలుగా ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదలకు రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణం, రూ. 500 గ్యాస్ సరఫరా, మహాలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, 58వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీవుల్లా, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**- సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్**
**- డిప్యూటీ సిఎం భట్టి హామీతో దీక్ష విరమణ**



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని పాత రైల్వే గేటు వద్ద ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం, టిడిపి, ఎమ్మార్పీఎస్ పార్టీ, స్థానిక వ్యాపారులు ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పాత రైల్వే గేటు మార్గం గుండా నిత్యం వందలాది మంది పాదచారులు వివిధ పనులకు కోసం ప్రయాణిస్తుంటారని, పరిసర ప్రాంతాల గ్రామాలు, పట్టణ ప్రజలకు పక్కనే ఉన్న ఆర్వోబిని ఎక్కేందుకు కష్టతరం కావటంతో ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారని, ఈ మార్గాన్ని గోడ కట్టి మూసి వేస్తే ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటారని, ప్రత్యామ్నాయ మార్గం చూపే వరకు ఉద్యమం ఆగదన్నారు. మధిర వన్ టౌన్, టూటౌన్ కు గొలుసుకట్టుగా ఉన్న రైల్వే ట్రాక్‌కు మార్గాన్ని మూసివేస్తే మధిర పట్టణం రెండుగా విడిపోతుందని, ఇప్పటికే మూడవ రైల్వే లైన్ నిర్మాణ పనులు వలన వ్యాపారాలు లేక వ్యాపారులు దివాలా తీసే పరిస్థితికి వచ్చిందన్నారు. రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ నిరసన దీక్షలకు బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని, దీనిపై డిప్యూటీ సిఎం భట్టివిక్కరమార్క స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన దీక్షను సందర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ సమస్యను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు, తక్షణమే స్పందించిన భట్టి రైల్వే అధికారులతో మాట్లాడి నడకమార్గం వదలి గోడ నిర్మాణం చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రైల్వే శాఖ మధిర ఎఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ అండర్ రైల్వే పాస్ నిర్మాణం చేపట్టేంత వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా మూడు అడుగులు దారి ఏర్పాటు చేయటం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీంతో నిరసన దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బెజవాడ రవిబాబు, మడుపల్లి గోపాలరావు, శీలం నర్సింహారావు, పాపినేని రామనర్సయ్య, మల్లాది హన్మంతరావు, రిటైర్డ్ ఎంపిడిఓ మురళీధర్‌రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కూరపాటి సునీల్ మాదిగ, నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న మోడీ సర్కార్

**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న మోడీ సర్కార్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం పాల్వంచ పట్టణంలోని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కార్పోరేటీకరణ, కాషాయికరణ కుట్రలు చేస్తున్నారన్నారు. మోడిపాలనలో ఉద్యోగాల కల్పన అటుపెడితే తొలగింపులే ఎక్కువయ్యాయని, కేంద్రం మతాన్ని, కులాన్ని అడ్డుపెట్టుకుని హిందుత్వ ఎజెండాతో పాలన సాగిస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ నిర్బంధాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకు భంగం వాటిల్లిందని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని కేంద్రంపై తిరుకుబాటు




చేయకుంటే దేశంలో స్వేచ్ఛావాయివులు పీల్చే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, మడుపు ఉపేంద్రచారి, గిరి, శ్రీను, రహమాన్, సత్యనారాయణ, అప్పారావు, కృష్ణ, రామారావు, అజిత్, బిక్కులాల్, వెంకన్న, లక్ష్మీ , రమేష్, ప్రభాకర్, రవి, రంగయ్య, కరీం, గోపి, నాయుడు, వెంకన్న పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/భద్రాచలం :** కొత్తగూడెం 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శేషగిరినగర్ వద్ద తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా తారసపడ్డ లారీలో రూ.3 కోట్ల 63 లక్షల 68 వేల గంజాయిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేస్తుండగా యుపి82ఏటి9894 నెంబర్ గల లారీని ఆపి సోదాలు నిర్వహించారు. ఈ లారీలో 717.360 కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ లారీలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివమ్ గుప్తా అనే వ్యక్తి పట్టుబడ్డ లారీ డ్రైవర్ భూరిసింగ్, రవికుమార్ అనే ఇద్దరు వ్యక్తులను ఏపిలో గల అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని తులసిపాక గ్రామ అటవీ ప్రాతంలో లోడ్ చేసుకుని రావాలని చెప్పి పంపించాడు. లారీలో కొత్తగా ఛాంబర్‌లా తయారు చేసి ఎవ్వరికీ అనుమానం రాకుండా లోడ్ చేశారు. అక్కడి నుండి బయలు దేరి భద్రాచలం మీదుగా ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఆగ్రాకు తరలించేందుకు ప్రయత్నించారు. గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు కొత్తగూడెంలో కాపుగాసి 1 టౌన్, సిసిఎస్ పోలీసులు సంయుక్తగా పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న 10 మందిపై కేసులు నమోదు చేశారు.



# దళితుల పట్ల ఇంకా.. వివక్ష

**ప్రజాపక్షం /నిడమనూరు:** దేశం వెలుగుతోంది అభివృద్ధిలో అంతరిక్షం వైపు దూసుకుపోతుంది ఇవి పాలకులు ప్రభుత్వాలు ప్రజలకు నిత్యం చెబుతున్న మాటలు కానీ దేశానికి స్వాతంత్రం వచ్చి 8 దశాబ్దాలు పూర్తికావస్తున్నప్పటికిని అభివృద్ధి ఎలా ఉన్నా సుమారు 80 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న స్వతంత్ర భారతంలో అస్పృశ్యత మాత్రం అలాగే ఉంది అనడానికి ఉదాహరణగా నిత్యం ఎక్కడో చోట దళితులపై జరుగుతున్న దాడులు వివక్షను కాకుండా, కెవిపిఎస్ ఇటీవల చేసిన సర్వేలో వెలుగు చూసిన విషయాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఇటీవల నాగార్జునసాగర్ నియోజకవర్గంలో చేపట్టిన సర్వేలో అనేక గ్రామాలలో దళితులకు దేవాలయ ప్రవేశం లేకపోవడం, దళితులు ఏర్పాటు చేసే పూజా కార్యక్రమాలకు వివాహాలకు బ్రాహ్మణులు హాజరు కాకపోవడం ఇలాంటి విషయాలు వెలుగులోకి రావడం విశేషం, అస్పృశ్యత నిర్మూలన కోసం ప్రభుత్వాలు దళితవాడలో సహపంపి భోజనాలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నప్పటికిని పూర్తిస్థాయిలో అవి ఫలితం చూపడం లేదని దళిత సంఘాల నుండి విమర్శలు వస్తున్నాయి, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర మండలం సంగారం, ఉట్లపల్లి, తిరుమలగిరి, సాగర్ మండలం నెల్లికలు, గ్రామాలలో దర్గా, గుడిలోకి దళితులను రానివ్వడం లేదని, నిడమనూర్ మండల కేంద్రంలోని దళితవాడల్లో నిర్వహించే వివాహ, పూజా కార్యక్రమాలకు బ్రాహ్మణులు హాజరు కావడం లేదని, కెవిపిఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు, శనివారం కెవిపిఎస్ నాయకులు మండల కేంద్రంలో నిర్వహించిన సర్వేలో మండల కేంద్రంలోని శివాలయంలోకి దళితులను అనుమతించడం లేదని, మిగతా కులాల వారు గర్భగుడిలో కొబ్బరికాయలు కొడితే దళితులు గుడి బయట కొట్టాల్సి వస్తుందని, తమ గోత్రం చెప్పగానే ఆలయ పూజారి దూరంగా ఉండు అంటూ తమని వెలివేస్తున్నదని దళితులు మొరపెట్టుకున్నట్లు కెవిపిఎస్ నాయకులు చెబుతున్నారు, దళితులకు అర్చన చేయకుండా వివాహాలు చేయకుండా పూజారులు ఉండడం వివక్ష కాదా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. దేవలయాలలో దళితులను అంటరానివారిగా చూస్తూ అందరితో సమానంగా దేవాలయ ప్రవేశం నిరకరించడం సహించమని వివక్ష కొనసాగుతున్న గ్రామాలలో డివిజన్ స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అవగాహన సమావేశాలు నిర్వహించి దళితులకు కూడా దేవాలయాల్లోకి ప్రవేశం ఉండేలా చర్యలు తీసుకుంటామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున తెలిపారు.

# ప్రభుత్వ అధికారులారా పాత బడ్డ చెక్ డ్యామ్‌కి వెళ్దాం పదండి..

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ జిల్లా:** అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామం ఈ గ్రామానికి అనుకొని ఉన్న వాగు పెద్దావాగు ఈ వాగు అన్ని కాలంలో ఎప్పుడు నీటితో ప్రవహిస్తూ ఉండేది వేసవి నడిఎండ కాలంలో తక్కువ తక్కువలో రెండు మూడు ఇంచుల నీరు ప్రవహిస్తుంటుంది వేసవి ఎండాకాలంలో నేటి సమస్య కొరత లేకుండా వ్యవసాయ రైతు పశుపోషణ ఎద్దులు, బర్రెలు, గొర్రెలకు అలాగే గ్రామంలో ఉండే చేతి హ్యాండ్ బోర్ పంపులకు వ్యవసాయ మోటార్లకు బావులకు భూగర్భ జల ఉత్పత్తి కొరకు ఈ వాగులో 20 సంవత్సరాల కిందట నీటిని నిలువ చేసేందుకు అప్పుడున్న ప్రభుత్వం ఆనాటి సర్పంచ్ ల ద్వారా మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పొడవు 500 మీటర్ల దూరంలో ఉపాధి కూలీల ద్వారా చెక్ డ్యామును నిర్మించడం జరిగింది. కాలక్రమేణ పరంగా అధిక వర్షాల కురవడంతో వరద ప్రభావం వల్ల ఒక సైడ్ ఈ డ్యామ్ కోతకు గురి కావడంతో నీరు నీలవ లేకుండా పోతుంది. ఈ చెక్కు లోపల భాగంగా వర్షపు వరద ప్రభావం వల్ల బురద వండు పూర్తిగా చేరి జమ్ము పరంగి ముల్లకంప చెట్టు లబ్బర్ తీగ పిచ్చి మొక్కలు మొలచి ఏపుగా పెరిగి పెరిగి అల్లుకపోవడంతో ఈ డ్యామ్ నిరుపయోగంగా మారింది. కావున ప్రభుత్వాధికారులైన గ్రామపంచాయతీ కార్యదర్శి మండల ఎంపీడీవో జిల్లా డిపిఓ జిల్లా కలెక్టర్ చెక్ డ్యామ్ ను సందర్శించి నీటి సమస్య లేకుండా భూగర్భ జలాలు అడుగంటిపోకుండా వేసవి కాలంలో మూగ జీవాలైన ఎద్దులక గొర్రెలకు మేకలను పాడి పశువులకు వివిధ రకాలైన ఆకాశ పక్షులకు త్రాగటానికి నీటిని నిల్వచేసే విధముగా చెక్ డ్యామ్ ను పుణ నిర్మాణం చేసి ఈ డ్యామ్ కు రెండు సైడ్ల మట్టి రొడ్డును చేపట్టాలని గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డి కర్ణసింహ రెడ్డి శాంతకుమార్ నజీర్ మిగత రైతులు కోరుతున్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/గుండాల :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా , వరంగల్ పట్టనంలో నిర్వహించే రజతోత్సవ సభకు పార్టిశ్రేనులు, అభిమానులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టి జిల్లా అధ్యక్షులు, మాజి శాసన సభ్యులు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిదిలోని దామర్‌తోగు గ్రామంలో కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రికలను కార్యకర్తలతో కూడి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌జిల్లా ఎలకతుర్తి వద్ద ఈ సభ నిర్వహిస్తున్నారని కార్యక్రమానికి మాజి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేకర్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో తెల్లం భాస్కర్, రావుల సోమన్న, సుతారి సత్యం, నాగేశ్వరావు, గడ్డం వీరన్న, తాటి క్రిష్ణ, బొమ్మెర్ల శ్రీను, రాంబాబు, సుదాకర్, పద్మారావు, సతీష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**-కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారం**
**-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**






**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న పాలకుల విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని నర్సింహాస్వామి గుడి వద్ద జరిగిన 43, 52 డివిజన్ల సిపిఐ శాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజలపై భారాలు వేస్తూ దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేశారని ఆయన విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. దేశంలోని సంపదను, సహాజ వనరులను కొద్ది మంది వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మతం పేరుతో ప్రజల మధ్య విభజన తెచ్చి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంను ఖూనీ చేస్తూ రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తున్నాయన్నారు. వంద ఏళ్ల చరిత్ర కలిగిన సిపిఐ అనేక పోరాటాల ద్వారా ప్రజలకు అనేక హక్కులను సాధించిపెట్టిందన్నారు. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న అసమానతలు, సమస్యల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేద ప్రజలకు రక్షణగా ఉంటుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతం చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించి పాలకుల విధానాలను తిప్పికొట్టాలని బాగం పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు కటుకూరి సతీష్‌రెడ్డి, ఎండి రెహ్మాన్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, ఏపూరి లతాదేవి, తాటి వెంకటేశ్వర్లు, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటేశ్వరుని ముత్యాలకవచ అలంకార రూప దర్శనం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు శనివారం స్వామి వారు ముత్యాల కవచ అలంకార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మల ఆధ్వర్యంలో ఘనంగా పంచామృతాలతో సర్వాంగ అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నిత్య కళ్యాణంలో భాగంగా అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరింటెంట్ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం...**

జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు కృష్ణాజిల్లా విజయవాడ పట్టణానికి చెందిన నిమ్మగడ్డ శ్రీనివాసరావు, శ్వేతా దంపతులు వారి కుమార్తె నిమ్మగడ్డ శ్రీహిత వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి నారాయణరెడ్డి, అధ్యక్షులు బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఉపాధ్యక్షురాలు గిరిజ లక్ష్మీ, సహాయ కార్యదర్శి చింతకిషోర్ కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, చొప్పవరపు శ్రీనివాసరావు, కాకుమాను లీలాకృష్ణ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# రైస్ పుల్లింగ్ ముఠా అరెస్టు

**-అప్రమత్తంగా ఉండాలి :**
**ఎస్ఐ ఈ రాజేష్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైస్ పుల్లింగ్ ముఠా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్గంపాడు ఎస్ఐ ఈ రాజేష్ అన్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో బూర్గంపాడు ఎస్ఐ ఈ రాజేష్ తన సిబ్బందితో కలిసి సారపాక సెంటర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈక్రమంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనబడగా వారిని పట్టుకొని విచారించారు. పోలీసుల విచారణలో ముద్దాయిలు దొనకొండ సురేష్ మారుతీనగర్ పాల్వంచ, ఎస్‌కే రహీం భద్రాచలం, ఊర్ల శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మా వద్ద రైస్ పుల్లింగ్ మిషన్ ఉన్నదని వేరే వ్యక్తులను నమ్మించి వారి వద్ద నుండి డబ్బులు తీసుకొని మోసం చేస్తూ ఉంటామని, అదే విధంగా చర్ల మండలంకు చెందిన కొమరం రాజబాబు బతినపల్లి గ్రామం అనే వ్యక్తిని రైస్ పుల్లింగ్ మిషన్ ఉన్నదని నమ్మించామని, అతని వద్ద నుండి లక్ష రూపాయలు తీసుకోవడం జరిగిందని, అతను రైస్ పులింగ్ మిషన్ ఇవ్వమని అడుగుతుండా మరల లక్ష రూపాయలు తీసుకొని బూర్గంపాడు మండలంలోని మణుగూరు క్రాస్ రోడ్ వద్దకు 25 జనవరి 2025 సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో రమ్మనగా అతను వచ్చిన తర్వాత అతనని కొట్టి అతని చేతులో ఉన్న లక్ష రూపాయలు బలవంతంగా గుంజుకొని బ్రీజా కారులో మేము, జంగారెడ్డిగూడెంకు చెందిన నారాయణతో కలిసి వెళ్లిపోయామని, భద్రాచలంలో ఇంకా ఎవరైనా అమాక వ్యక్తులకు రైస్ పుల్లింగ్ మిషన్ గురించి చెప్పి వారిని నమ్మించి, డబ్బులు తీసుకుందామనే ఉద్దేశంతో భద్రాచలం వెళ్తుండగా సారపాక సెంటర్ వద్దకు పట్టుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ ఈ రాజేష్ మాట్లాడుతూ ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పరారీలో నారాయణ జంగారెడ్డిగూడెంకి చెందిన వ్యక్తి ఉన్నాడని అన్నారు. పట్టుబడిన వీరి వద్ద నుండి రూ 1,90,000నగదును, మూడు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విధంగా రైస్ పుల్లింగ్ మిషన్, గుప్త నిధులు ఉన్నాయని, దొంగ నోట్లు మార్చిడి చేస్తామని అనే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని తెలిపారు. అలాంటి వ్యక్తుల గురించి సమాచారం తెలిసినచో వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# సీపీఎం సమస్యల అధ్యయన యాత్ర

**ప్రజాపక్షం/ఇల్లెందు:** సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సమస్యల అధ్యయనయాత్రను మండలంలోని పైలెట్ గ్రామమైన పూబెల్లి, సుందరయ్యనగర్,నెహ్రూనగర్, రైటర్‌బస్తీ, ఇల్లందులపాడులలో ఇంటింటి సర్వేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్‌నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరుపై అధ్యయనం నిర్వహిస్తున్నామని, పూబెల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించినట్లు పేర్కొన్నారు. పూబెల్లి గ్రామంలో మొత్తం 80మందిని అర్హులుగా గుర్తించి పైలెట్ గ్రామంగా ప్రకటించి నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయింపులు సరిపోవని, పునాదుల నిర్మాణానికి రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు వెచ్చించాలని కేంద్ర ప్రభుత్వం ఆవాజ్ యోజన పథకాన్ని జోడించి రూ.15లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అధ్యయన యాత్రలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, వజ్జ సురేశ్, కొడెం బోస్, అబ్బాస్, నాగరాజు, మమత, సోమ కృష్ణ, ఆడెపు కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నేడు మధిరలో డిప్యూటీ సిఎం భట్టి పర్యటన

**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క మధిరలో ఆదివారం పర్యటించనున్నట్లు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెటి కిషోర్, మిరియాల రమణగుప్త తెలిపారు. మధిర మున్సిపాల్టీ అభివృద్ధిలో భాగంగా రూ.120కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా మధిర మున్సిపాల్టీని ఉత్తమ మున్సిపాల్టీగా తీర్చిదిద్దే విధంగా భట్టివిక్రమార్క కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. భట్టి పర్యటనకు అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి






**ప్రజాపక్షం/ మధిర :** ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ రజోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని మాజీ జెడ్పిచైర్మన్ , బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా వాల్ రైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత అధికారంలో ఉన్న 10 సంవత్సరాల కాలంలో తెలంగాణను మాజీ సిఎం కేసిఆర్ నేతృత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తిరిగి విజయం సాధించటం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, చిత్తారు నాగేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కనకపూడి బుచ్చయ్య, కోన నరేందర్‌రెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్బి, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వనజీవి దరిపెల్లి రామయ్య మృతి తీరని లోటు

**ప్రజాపక్షం/మణుగూరుః** ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపెల్లి రామయ్య మృతి తీరని లోటు అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించి, మొక్కలను బిడ్డలవలే పెంచారన్నారు. ఇంటిపేరునే వనజీవిగా మార్చుకొని కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారన్నారు. పర్యావరణ హితమే తన ఊపిరిగా భావించిన ఆయన, ఆరోగ్యం సహకరించకున్నా మొక్కలు నాటే ఉద్యమాన్ని మాత్రం ఆపలేదన్నారు. వారి జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి వనజీవి రామయ్య నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండల మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన భారతదేశ వ్యాప్తంగా జరుగు ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మణుగూరు అంబేద్కర్ కూడలిలో జరుగు కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘ నాయకులను వారి కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మాల మహానాడు అధ్యక్షులు వేర్పుల నరేష్, ప్రధాన కార్యదర్శి బూర్గుల సతీష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు దాసరి వెంకట్, వేర్పుల సురేష్, మణుగూరు మండల మున్నూరు కాపు సంఘ కార్యదర్శి గాండ్ల సురేష్, మణుగూరు పిఏసిఎస్ డైరెక్టర్ మామిడిపల్లి సీతారాములు, దాచేపల్లి శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, పులిశెట్టి బాబు, కాట్రగడ్డ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై వక్ఫ్ బిల్లుతో బిజెపి దాడి

**ప్రజాపక్షం/బోనకల్:** రాజ్యాంగంపై వక్ఫ్ బిల్లుతో బిజెపి దాడి చేసిందని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా వైరామధిర ప్రధాన రహదారి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం ద్వారా బిజెపి తన మతోన్మాద మత పరమైన విభజన ఎజెండాను తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మాతంగి శ్రీనివాసరావు, చావా రామకృష్ణ, యంగల పెద్ద రమేష్, మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ నిజాం, మతపెద్దలు షేక్ అబ్బాస్‌మియా, షేక్ గౌడంజాను, సుభాని, పెంటుసాహెబ్, తోటపల్లి సాల్‌మాన్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో పీఎం శ్రీ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ హాజరయ్యారు. వార్షికోత్సవ వేడుకలు ప్రారంభిస్తూ ప్రిన్సిపాల్ బాలరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాల్యం ఎంతో విలువైందని విద్యార్థి దశ నుండి ఎంతో క్రమ శిక్షణగా ఉండి విద్యతో పాటు అనేక అంశాలు నేర్చుకొని సొసైటీలో ఉన్నత వ్యక్తిగా ఎదగాలని, దేశానికి మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడాలని తెలిపారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థులకు అనేక క్రీడలను నిర్వహించి, వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు నాగరాజు, సీనియర్ జయల శ్రీనివాసరావు, జెవి ప్రిన్సిపల్ పిల్లి బాలకృష్ణ, గణిత ఉపాధ్యాయులు సుధాకర్, అరికొట్ల ప్రసాద్, గాయం వెంకటేశ్వరరావు, టి గోపయ్య, టి రాజేందర్, ముత్యం, నవీన్, ఉపాధ్యాయ, కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.